సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్ల వీధిలో అల్లరి యూత్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శని, ఆదివారాలు స్థానిక మహిళలకు ముగ్గులు, కుర్చీ ఆట, లెమన్ స్పూన్, మ్యూజిక్ డ్యాన్స్ వంటి పోటీలు నిర్వహించారు. విజేతలకు ఆదివారం సాయంత్రం వినాయక మండపం వద్ద బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలో ప్రసాదుల లలిత ప్రథమ బహుమతి, ఉరుకూటి రూపా రెండో బహుమతి సాధించారు. కుర్చీ ఆటలో ధర్మాల ఊర్వశి, మేరి, చిన్న, బుజ్జి, పంచదార్ల రక్షితలు విజేతలుగా నిలిచారు. వీరికి ఉత్సవ నిర్వాహకులు బొట్ట వెంకటప్పారావు యాదవ్(చిన్న), దాడి బాలకృష్ణ, నమ్మి శంకర్‌రావు యాదవ్‌లు బహుమతులను అందజేశారు.

ఉరుములతో వాన



శ్రీహరిపురంలో కురుస్తున్న వర్షం

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షం పడింది. ఎన్నడూ లేని విధంగా పెద్ద, పెద్ద శబ్దాలతో కూడిన ఉరుములు రావడంతో పారిశ్రామిక వాసులు భయాందోళన వ్యక్తం చేశారు. ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు సాహసం చేయలేదు. సుమారు గంట పాటు మోస్తారు వర్షం కురిసింది.

పేకాట శిబిరంపై దాడి


- పోలీసుల అదుపులో 9 మంది పేకాటరాయుళ్లు

మల్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. స్థానిక పట్టాభిరెడ్డి గార్డెన్స్ భాస్కర్ రెసిడెన్సీలో ఆదివారం గుట్టుగా పేకాట శిబిరం నిర్వహిస్తున్న బృందంపై ఐదో పట్టణ పోలీసులు దాడి చేసి పేకాటాడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.37 వేలు నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేడు అప్రెంటిస్‌షిప్ మేళా

కంచరపాలెం: పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో కోర్సులు పూర్తి చేసి అప్రెంటిస్ చేయని అభ్యర్థుల కోసం కంచరపాలెంలోని విశాఖ ప్రభుత్వ పాత ఐటీఐ కళాశాల ఆవరణలో సోమవారం ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా–2025 నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, జోన్–1 ఉప సంచాలకుడు ఆర్వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే, హిందుస్తాన్ షిప్‌యార్డ్, ఆలిండియా రేడియో, మేధా సర్వో డ్రైవ్స్, జయభేరి లిమిటెడ్ కంపెనీలతోపాటు 12కి పైగా ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు కంపెనీలు పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సోమవారం ఉదయం 9 గంటలకు బయోడేటా, ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

ఇస్కాన్‌లో హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: హరేకృష్ణ, హరేరామ అంటూ సాగర్ నగర్ ఇస్కాన్ మందిరం హరినామస్మరణతో మార్మోగింది. వారాంతపు పూజల సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలు, ప్రవచనాలు ఆదివారం ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

డెబ్రిస్‌తో పరేషాన్



ఆర్పీ పేట రైల్వే గేటు - మర్రిపాలెం రహదారిలో డంప్‌చేసిన నిర్మాణ వ్యర్థాలు



గొల్ల కంచరపాలెం - ఐటీఐ జంక్షన్ రైల్వే ట్రాక్ రహదారిలో నిర్మాణ వ్యర్థాలు

- 56, 57 వార్డుల్లో రోడ్లకిరువైపులా భవన నిర్మాణ వ్యర్థాల డంపింగ్
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు
- పారిశుధ్య పనులకు ఆటంకం
- అధికారుల పర్యవేక్షణ లోపం



కంచరపాలెం ఆరోగ్య కేంద్రం ప్రధాన గేటు వద్ద పారబోసిన డెబ్రిస్

కంచరపాలెం: రహదారులకు ఇరువైపులా ఇష్టానుసారంగా భవన నిర్మాణ వ్యర్థాలను డంప్ చేయడం వల్ల స్థానిక ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య సిబ్బంది శుభ్రతా పనులకు ఆటంకం కలుగుతోంది. ఈ సమస్యను పట్టించుకునే వారు లేకపోవడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. భవన నిర్మాణ వ్యర్థాలైన డెబ్రిస్‌ను దూర ప్రాంతాలకు తరలించి డంప్ చేయాల్సి ఉన్నా.. వార్డుల్లోని రహదారులపైనే పారబోస్తున్నా.. సచివాలయ టౌన్ ప్లానింగ్ కార్యదర్శులు పర్యవేక్షించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

పట్టించుకునే వారేరి..?

జీవీఎంసీ 56, 57 వార్డుల్లో కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్ పరిధిలో గల గొల్ల కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, కంచరపాలెం పబ్లిక్ హెల్త్ సెంటర్ రహదారి, గవర కంచరపాలెం, దుర్గానగర్, గోకుల్‌నగర్, గౌరీనగర్, సుభాష నగర్, శ్యామ్‌నగర్, భవానీ గార్డెన్స్ తదితర ప్రాంతాల్లోని రహదారులకు ఇరువైపులా ఇంటి నిర్మాణ వ్యర్థాలను పడేస్తున్నా.. పట్టించుకునే నాథుడు కనిపించడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆర్పీ పేట రైల్వే గేటు నుంచి మర్రిపాలెం వాషింగ్ లైన్‌కు వెళ్లే రహదారులు దారుణంగా ఉండటంతో ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది నిత్యం రోడ్లు ఊడ్చే పనులు చేపడుతున్నా.. డెబ్రిస్ వల్ల ఆటంకం ఏర్పడి పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. వార్డుల్లో భవన నిర్మాణాలు అధికంగా జరుగుతుండటంతో వాటి వ్యర్థాలను దూర ప్రాంతాలకు తీసుకెళ్లి డంప్ చేయాల్సి ఉన్నా.. రాత్రి వేళల్లో రోడ్లకు ఇరువైపులా పారబోస్తున్నారు. ప్రభుత్వం చేపడుతున్న పబ్లిక్ వర్క్‌ల్లో కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేసి వ్యర్థాలను ఆయా ప్రాంతాల్లో వదిలేసి పోతున్నారని, ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వార్డుల్లో పర్యటించి, పరిశీలించి.. భవన నిర్మాణ వ్యర్థాలు డంప్‌చేయకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

రోడ్లకు ఇరువైపులా భవన నిర్మాణ వ్యర్థాలను వేయడం వల్ల పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. డెబ్రిస్‌ను తొలగించకుండా వదిలేయడం వల్ల రాకపోకల సమయంలో నిత్యం ఇబ్బందులు పడుతున్నాం. సంబంధిత అధికారులు స్పందించి వార్డుల్లోని రహదారులపై డెబ్రిస్ డంప్ చేయకుండా చర్యలు తీసుకోవాలి. – ఎస్.గోవిందరాజు, ఆర్పీ పేట

ఇదేనా 'చెత్త'శుద్ధి!



మల్కాపురం సేవా మార్గంలో వ్యర్థాలు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపంలోని పాత పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు పక్కన వ్యర్థాలను నిర్లక్ష్యంగా డంప్ చేస్తున్నారు. వీటిని సకాలంలో పారిశుధ్య కార్మికులు తొలగించక పోవడంతో ఆదివారం ఈ మార్గంలో రాకపోకలు సాగించిన వారు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యర్థాలపై పశువులు, పందులు చేరి పరిసర ప్రాంతాలను మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. శానిటరీ అధికారులు స్పందించి చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక వాసులు కోరుతున్నారు.

బకాయిల కోసం సినర్జీస్ కార్మికుల ధర్నా



బకాయిలు చెల్లించాలని సినర్జీస్‌గేటు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అగనంపూడి: దువ్వాడ వీఎస్‌ఈజెడ్ ఆవరణలోని సినర్జీస్ క్యాస్టింగ్స్ లిమిటెడ్ కంపెనీ కార్మికులు ఆదివారం ఆందోళన చేపట్టారు. యాజమాన్యం తమకు ఆరు మాసాల జీతాలు చెల్లించకుండా మొండిగా వ్యవహరిస్తుందని సంస్థ కార్మికులు మూడు రోజులుగా ఆందోళనబాట పట్టారు. సంస్థ గేటు వద్ద ధర్నా చేపడుతున్నా యాజమాన్యం కనీసం స్పందించకపోవడం దారుణమని కార్మికులు, నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది సెప్టెంబర్ నుంచి ఈ ఏడాది ఆగస్టు వరకు ఆరు మాసాలు మాత్రమే జీతాలు చెల్లించిందని, మిగిలిన ఆరు మాసాలు జీతాలు చెల్లించకుండా తాత్సారం చేస్తుండడంతో గతిలేని పరిస్థితిలో ఆందోళనకు దిగాల్సి వచ్చిందని కార్మికులు చెప్పారు. అలాగే పీఎఫ్, ఈఎస్ఐల నిమిత్తం తమ జీతాల నుంచి డబ్బులు కోత విధిస్తున్నా ఆయా సంస్థలకు చెల్లించకుండా అన్యాయం చేస్తుందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్థలో 20 నుంచి 25 సంవత్సరాలు పాటు సేవలు అందించిన తమకు యాజమాన్యం తీరని అన్యాయం చేస్తుందని.. పిల్లల పాఠశాలల ఫీజులు చెల్లించుకోలేక, ఒకపూట తింటే మరోపూట పస్తులు ఉండాల్సి వస్తుందని వాపోయారు. యాజమాన్యం మొండి వైఖరి విడనాడి న్యాయంగా బకాయిలు చెల్లించకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.శ్రీనివాస్, దాస్, హరిబాబు, బషీర్, కోటి తదితరులు పాల్గొన్నారు.

గౌరవ వేతనం కొనసాగించాలి



కరపత్రాలు ప్రదర్శిస్తున్న కార్పొరేటర్ బర్కత్ అలీ, ముస్లింలు

మర్రిపాలెం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనారిటీల సౌకర్యార్థం మసీదులకు సంబంధించి ఇమాం, మౌజిన్‌లకు అందించే గౌరవ వేతనాన్ని కొనసాగించాలని ముస్లిం మత పెద్దలు కోరుతున్నారు. ఈమేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేయనున్నట్టు 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ తెలిపారు. వార్డు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముస్లింల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇమాంకు రూ.10 వేలు, మౌజిన్‌కు రూ.5 వేలు ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయా మసీద్ ఇమాం, మౌజిన్‌లకు గౌరవ వేతనం అందడం లేదని పేర్కొన్నారు. 66వ వార్డు కార్పొరేటర్ ఇమ్రాన్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి ఇమాం, మౌజిన్‌లకు గౌరవ వేతనాలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఫైజల్, షరీఫ్, సౌకత్, అలీ, మునీర్ ఖాన్, మొహమ్మద్ బిలాల్, నబీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కాళీ కాలభైరవుల కల్యాణోత్సవం

సీతంపేట: అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో ఆదివారం కాళీ కాలభైరవుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. కుర్తాళం శంకరాచార్య, శ్రీలలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. పీఠం దర్బారు హాల్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై కాళీ కాలభైరవుల ఉత్సవ మూర్తులకు కల్యాణం చేశారు. సుముహూర్తం, మాంగల్యధారణ, తలంబ్రాల ఘట్టాలు కళ్లకు కట్టినట్టు చూపారు. పీఠం పండితులు కాళీ కాలభైరవుల కల్యాణ విశిష్టతను వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణం వీక్షించారు. తీర్థ ప్రసాదాలు, తలంబ్రాలను భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేపట్టారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సహాయ నిధి చెక్కు పంపిణీ



జయమ్మకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో నివాసముంటున్న కంబాల జయమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై వైద్య ఖర్చులు భరించలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంది. సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.51,550 చెక్‌ను ఆదివారం ఎమ్మెల్యే గణబాబు అందజేశారు. కార్యక్రమంలో మజ్జి మాలి నాయుడు, నీలాపు జోజి తదితరులు పాల్గొన్నారు

భవన నిర్మాణ కార్మికులను పట్టించుకోని ప్రభుత్వం

మధురవాడ: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు పేడాడ రాజశేఖర్ అన్నారు. ఆదివారం ఉదయం కొమ్మాది జంక్షన్ ఏకే ప్యాషన్స్ సెంటర్ వద్ద భవన నిర్మాణ కార్మికుల నిరసన కార్యక్రమ పోస్టర్‌ను సీఐటీయూ నాయకుడు పి.రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న విజయవాడలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారాలు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులు ఇందాన పూర్ణిమ, ఇందాన అనిత, దొడ్డి సంజమ్‌కుమార్, ఇ.థామస్, పి.విక్రాంత్, దులిసి లక్ష్మి, పాత్రపల్లి సునీల్‌కుమార్ తదితరులను పార్టీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ జ్ఞానాపురానికి గొప్ప పేరు తీసుకొచ్చిన ఉపాధ్యాయులను సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ మైనారిటీ వింగ్ రాష్ట్ర నాయకులు వేళంగిణీరావు, పాత్రపల్లి వేళంగిణిరాజు, దాలిబాని మధుకుమార్, గిడుతూరి జాన్, దాలిబాని పర్సి, వాకపల్లి మురళి, కోరాడ శౌరీ, అరసాడ మధు, పాలిక కిషోర్, దేవి పాల్గొన్నారు.

స్నేహితుడి జ్ఞాపకార్థం వాలీబాల్ టోర్నీ



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు

సబ్బవరం: తమతో ఐదేళ్ల పాటు చదువుకుని ఆకాల మరణం పొందిన స్నేహితుడి జ్ఞాపకార్థం మిత్రులు వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. స్థానిక ప్రతిభ విద్యాలయంలో 2005–06 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్వహించిన ఈ టోర్నీని శాప్ డైరెక్టర్ పీబీవీఎస్ఎన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ బ్యాచ్‌కు చెందిన కర్రి శేషు 2022లో పాము కాటుకు గురై మరణించాడు. శేషు వాలీబాల్ ప్లేయర్ కావడంతో గత మూడేళ్లుగా ఆయన పేరిట ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. విజేతలకు నగదు బహుమతులను అందించి స్నేహితుడి గొప్పతనాన్ని ఏటా ఈ విధంగా గుర్తు చేసుకుంటున్నారు. ఈ పోటీల్లో పలు ప్రాంతాల నుంచి 11 జట్లు పాల్గొన్నాయి. ముఖ్య అతిథి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందించారు. ఆయన ఆర్థిక సాయంతో క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం అందించారు.

ఈవోఐ పేరుతో స్టీల్ ప్లాంట్ అమ్మకానికి కుట్ర

సీపీఎం నేతల ఆరోపణ



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు,కార్యకర్తలు

మల్కాపురం: ఈవోఐ పేరుతో స్టీల్‌ప్లాంట్‌ను విక్రయించాలనే యోచనలో కేంద్రం ఉందని సీపీఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.విమల,బి.మమత ఆరోపించారు.స్టీల్ ప్లాంట్ ప్రైవేటీ కరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో ఆదివారం సీపీఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యంలో 58వ వార్డు రామ్‌నగర్ వద్ద నిరసన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న విమల, మమతలు మాట్లాడుతూ ఈవో ఐ పేరుతో స్టీల్ ప్లాంట్‌ను 46 విభాగాలుగా విభజించి అమ్మకానికి ప్రధాని నరేంద్ర మోదీ యత్నిస్తున్నారని మండిపడ్డారు. ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వాగ్దానాలు,ప్రసంగాలు ఇచ్చారు.. ఎప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. కూటమి నాయకుల చేతగాని పాలన వల్ల ప్లాంట్‌లో వేలాది మంది కార్మికులు నేడు అవస్థలు పడుతున్నారన్నారు. ఈ సమస్యపై 11న పాతగాజువాక వద్ద భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని,దీనికి కార్మికులంతా హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పైడిరాజు,రమణ,రాజు,గంగులు,వరలక్ష్మి, ఈశ్వరి,అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ తక్షణమే ఆపాలి



ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

కంచరపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం 54, 55, 56 వార్డుల పరిధి కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఈవోఐని వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సర్వనాశనం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ క్యాంపెయిన్ చేపట్టామన్నారు. ఉక్కు పరిశ్రమలో తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యులు బి.పద్మ, జోన్ నాయకులు ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, సానబోయిన సోమేశ్వరరావు, జి.శ్రీనివాస్, బి.గంగరాజు, ఎల్లాజీ, కుమారి పాల్గొన్నారు.

టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలి



టిడ్కో గృహ సముదాయం వద్ద మాట్లాడుతున్న సీపీఐ సహాయ కార్యదర్శి సత్యనారాయణ

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని టిడ్కో గృహ సముదాయంలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి సరికాదని, వెంటనే హౌసింగ్ ప్రాజెక్టు వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళపాలెం టిడ్కో గృహ సముదాయం వద్ద ఏర్పాటు చేసిన లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల కిందట నిర్మించిన ఫ్లాట్లు కేటాయించినప్పటికీ కనీసం వసతులు కల్పించలేదన్నారు. దీంతో లబ్ధిదారులు కాలనీలో ఉండేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే కనీస వసతులు కల్పించేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.ఆనంద్, విష్ణుమూర్తి, టిడ్కో గృహ లబ్ధిదారుల సంఘ నాయకులు ఎ.గోపి, మల్లేశ్వరరావు, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

'బుద్ధిగా ప్రవర్తించి.. భవిష్యత్ బాగుచేసుకోండి'



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ దేముడుబాబు

పెందుర్తి: రౌడీ షీటర్లు బుద్ధి మార్చుకుని ప్రవర్తిస్తే వారి భవిష్యత్ బాగు చేసుకునే అవకాశం కల్పిస్తామని ఎస్ఐ దేముడుబాబు అన్నారు. సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని రౌడీ షీటర్లను హెచ్చరించారు. చెడు ప్రవర్తన వలన వారి కుటుంబాలు సమాజంలో చిన్న చూపునకు గురవుతాయన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లు పోలీసుల దృష్టికి వస్తే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని వివరించారు. వారికి పలు సూచనలు చేశారు. ఏఎస్ఐ కాశీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా పౌర్ణమి తిరువీధి



బేడా మండపంలో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం తిరువీధి వైభవంగా జరిగింది. సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో జరగాల్సిన తిరువీధిని చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం ఆలయ బేడామండపంలో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో వేంజేపచేశారు. బేడామండపంలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందించారు. పారాయణాలు చేశారు.

యూటీఎఫ్ రణభేరి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

గోపాలపట్నం: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్(యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించబోయే యూటీఎఫ్ రణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫెడరేషన్ కోశాధికారి రెడ్డి మోహనరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శాంతినగర్‌లోని హస్మీభవన్‌లో ఆదివారం కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడిచినా ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని విమర్శించారు. అంతేకాకుండా యాప్‌ల భారం, విద్యాశక్తి కార్యక్రమాలు, పరీక్షల మూల్యాంకనం, ఆన్‌లైన్ అప్‌లోడ్, గ్రీన్ పాస్‌పోర్టు వంటి బోధనేతర పనుల భారం ఉపాధ్యాయులపై పెరిగిందని, ఇది బోధనా సమయాన్ని తగ్గిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ 11వ పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని, సరెండర్ లీవ్ బిల్లులు మంజూరు చేయాలని, 12వ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే 29 శాతం ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి టీఆర్ అంబేడ్కర్, సభ్యులు కొత్తపల్లి రాంబాబు, తాడానా అప్పారావు, అనకాపల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com